# అంకురం

గన్నవరపు నరసింహమూర్తి



**ఏటి ఒడ్డున అర్చన తన మూడేళ్ల బాబుతో పడవ కోసం ఎదురు చూస్తోంది. ఆమె వచ్చి అప్పుడే గంటకు పైగా అయింది. ఆమె ఉదయం ఈ ఊరు ఆడపడుచు కూతురి పెళ్లికని వచ్చింది. పెళ్లికి వచ్చిన దగ్గర్నుంచి ఆమె మూడేళ్ల బాబు రామానికి విపరీతమైన జ్వరం, దాంతో పాటే వాంతులు.... అందుకే పెళ్లికి వచ్చిందే గానీ ఆమె దాన్ని ఆస్వాదించలేక పోయింది.**

వస్తున్నప్పుడు కారులో, ఏరుదాటుతున్నప్పుడు పడవలో ఎంతో హుషారుగా ఉన్న రామానికి పెళ్లికి వచ్చిన గంటకు జ్వరం మొదలైంది. అది మధ్యాహ్నానికి మరింత ఎక్కువైంది. అర్చనకు బాబు పరిస్థితి చూసి భయమేసింది. ఆ ఊళ్లోనే ఉన్న ఆర్.ఎమ్.పి డాక్టరుకి చూపిస్తే అతను ఏవో మందులిచ్చాడు కానీ, అవేమీ పని చేయలేదు. అందుకే సాయంత్రం త్వరగా పట్నం వెళ్లాలనీ ఎవరు చెప్పినా వినకుండా ఏటి ఒడ్డుకొచ్చేసింది. పట్నం వెళ్లాలంటే ఏరు దాటాల్సిందే. దానికి ఆ ఊరికున్న రెండు పడవలే ఆధారం. తను వచ్చినపుడు కారుని ఏటి ఆవలి ఒడ్డున ఉంచి పడవ దాటి వచ్చింది.

తను పెళ్లికి వెళ్లనని ఎంత చెప్పినా బలవంతంగా పంపించిన భర్త భరద్వాజ మీద పీకల దాకా కోపం వచ్చిందామెకు. ఆ రోజు అర్జెంట్ పని పడటంతో ఢిల్లీ వెళ్లవలసి రావటంతో అర్చనని బ్రతిమిలాడి పెళ్లికి పంపాడు; ఎవ్వరూ వెళ్లకపోతే చెల్లెలు లక్ష్మికి కోపం వస్తుందని అతని భయం. పైగా ఆమెకు ఒక్కతే కూతురు; అదీగాక భరద్వాజ పెళ్లైన తరువాత చెల్లెలి ఊరు ఒక్కసారి కూడా వెళ్లలేదు. అందుకే అర్చనకు వాళ్లతో పరిచయం లేకపోయినా అన్నీ చెప్పి పంపించాడు.

అర్చన అమెరికాలో పుట్టి పెరిగింది. కాలేజీలో పరిచయం అయిన భరద్వాజను ప్రేమించి పెళ్లాడింది. అప్పుడు భరద్వాజ ఎమ్మెస్ చదవడానికి స్టేట్స్‌కి వెళ్లాడు. పెళ్లయిన తరువాత అతను అమెరికాలోనే సెటిలవ్వాలన్న కండిషన్‌తో ఆమె పెళ్లికి ఒప్పుకుంది. కానీ భరద్వాజ తండ్రి హఠాత్తుగా చనిపోవడంతో అతని వ్యాపారాలు చూడ్డానికి యిండియా వచ్చేశాడు. అతనితో పాటే అర్చన కూడా వచ్చింది. ఆమె తండ్రి రఘురామయ్య కూడా ఒకప్పుడు కోనసీమ వాసే. యిక్కడ బ్రతకలేక అమెరికా వెళ్లి బాగా సంపాదించాడు.

విశాఖపట్నం నుంచి ఆమే కారు డ్రైవ్ చేసుకుంటూ వచ్చింది. సీతాపురం ఎలా వెళ్లాలో భరద్వాజ ఆమెకు అర్థమయ్యేలా రూట్ మేప్ గీసి మరీ చెప్పడంతో ఆమె పని సులువైంది. ప్రయాణంలో బాబు చాలా ఎంజాయ్ చేశాడు. కానీ సీతాపురం ఏటికి ఆవల ఉండటంతో కారుని ఆవలి గట్టు దగ్గర ఆపి, పడవ మీద ఏరుదాటి పెళ్లింటికి చేరింది.

అమెరికాలో పుట్టి పెరిగిన ఆమెకు ఆ ఏటి ఒడ్డున ఉండే ఆ పల్లె చాలా అందంగా కనిపించింది.

# కథ



తమ్ముడు భరద్వాజ రానందుకు ఆమె ఆడపడుచు శ్రీకళ్యాణి మొదట కోప్పడినా ఆమైనా వచ్చినందుకు ఎంతో సంతోషించింది. ఆమె పేరుపేరునా అందరికీ అర్చనని పరిచయం చేసింది. ఆ పల్లెటూరి వరుసలు, వాళ్ల హాస్యోక్తులు ఆమెని ఉక్కిరి బిక్కిరి చేశాయి. వాళ్లంతా తనని చూసి ఒకటే హడావిడి చేస్తూ, ఎంతో సరదాగా మాట్లాడేరు. కానీ ఆమె చిన్నప్పట్నించి అమెరికాలో ఒంటరిగా పెరగడం వల్ల కావచ్చు, ఆ పాశ్చాత్య నాగరికతా ప్రభావం వల్ల కావచ్చు వాళ్లతో మనస్ఫూర్తిగా యిమడలేకపోయింది. కానీ ఆమెకు వాళ్ల మధ్య ఉన్న ఆప్యాయతలు నచ్చాయి. తరచి చూస్తే ఆమెకు తనలో ఏదో లోపం కనిపించింది. వాళ్లలా తను ఆనందంగా ఎందుకు ఉండలేకపోతోందో అర్థం కాలేదామెకు. కానీ ఒక్క విషయం మాత్రం అర్థమైంది. వాళ్ల మాటల్లోగాని, చేష్టల్లో గాని రవంతైనా కల్మషం లేదు. స్వచ్ఛత కనిపిస్తోంది. ఆమె పుట్టి పెరిగిన వాతావరణంలో లేనిదదే. అందుకే భర్త ఆమెని పెళ్లికి వెళ్లమన్నప్పుడు వెళ్లనంది. అసలు అమెరికా నుంచి సంవత్సరం క్రితం విశాఖపట్నం వచ్చినా ఆమె ఎవరింటికీ వెళ్లలేదు.

పట్నవాతావరణంలో పెరిగిన ఆమెకు యింత అందమైన పల్లెలుంటాయనీ, ఆ ఊర్ని చూస్తేగానీ తెలియలేదు. అందమైన పేరు, తీరం వెంబడి తెల్లని ఇసుక తిన్నెలు, పొడవైన కొబ్బరిచెట్లు, పిల్లకాలువలతో ఆ ఊరు ఎంతో సుందరంగా ఉంది. ఉక్కిరి బిక్కిరి అయ్యే పట్నవాతావరణం నుంచి ఒక్కసారి

ఈ ప్రశాంత వాతావరణాన్ని చూడగానే ఆమె మనస్సు పులకించి పోయింది.

జ్వరం సాయంత్రానికి కూడా తగ్గకపోవడంతో ఆమె పట్నం బయలు దేరతానంటే ఆమె ఆడపడుచు కళ్యాణి కాదనలేకపోయింది. పైగా పెళ్లి కూడా అయిపోయింది. వెంటనే ఆమె తమ రైతు రాజయ్యని సాయం యిచ్చి ఏటి దగ్గరకు పంపించింది. అప్పట్నుంచీ ఆ ఏటి ఒడ్డున పడవ కోసం పిల్లాడితో ఎదురు చూస్తోంది. వచ్చిన దగ్గర్నుంచీ ఆమె చూపంతా ఆవలి ఒడ్డు మీదే ఉంది. ఆ ఊరికి ఉన్నవి రెండే పడవలు. ఉదయం తనను ఏరు దాటించిన పడవ యిక్కడే లంగరు వేసి ఉండటంతో ఆవలి ఒడ్డున ఉన్న రెండో పడవ మీదే ఆమె దృష్టి ఉంది. కొద్ది సేపటికి దాని తెరచాప కనిపించడంతో ఆమెకి కొంచెం ధైర్యం వచ్చింది. అది మెల్ల మెల్లగా వస్తోంది. అది రాగానే పడవవాణ్ణి బ్రతిమిలాడి వెంటనే ఆవలి ఒడ్డుకి బయలు దేరాలి. బాబుకి రానురాను జ్వర తీవ్రత ఎక్కువ కాసాగింది.

క్రమేపి ఆ తెరచాప దగ్గర కాసాగింది. తీరం వెంబడి గాలి ఉధృతంగా వీస్తుండడంతో అది మెల్లగా హోయలు పోతూ వస్తుంది. మరో పది నిమిషాలకు అది ఒడ్డుకు చేరింది. పడవలో జనం అట్టే లేరు. వాళ్లు దిగగానే ఆమె ఆ పడవ వాడి దగ్గరకు వెళ్లింది. త్వరగా వెళ్లకపోతే అతను లంగరు వేసి యింటికి వెళ్లి పోతాడని ఆమె భయం. కానీ దగ్గరకు వెళ్లి అతణ్ణి చూడగానే ఆమె ముఖ కవళికలు మారిపోయాయి. అతడు....ఉదయం తను కార్లో వస్తున్నప్పుడు లిఫ్ట్ అడిగిన వ్యక్తే....అవును....అతడే...యింతలో అతను కూడా అర్చనని చూశాడు; యిప్పుడు అతని ముఖంలో కూడా మార్పు కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. అతను ఆమె వైపు విసవిస చూస్తూ ఒడ్డుకి లంగరు వేయడానికి ఆయత్తమవుతున్నాడు; ఆమెకి నోట మాట రావటం లేదు. ఉదయం జరిగిన ఆ సంఘటన గుర్తుకు వస్తోంది.

***

ఆ రోజు ఉదయాన్నే అర్చన తన బాబుతో కారులో బయలు దేరింది. ఆ రోజు మొద్దు నిద్ర వల్ల బయలు దేరడం ఆలస్యం అయింది. పెళ్లి ముహూర్తం ఉదయం పదకొండు గంటలకి కావడంతో, ఆమె కారుని చాలా స్పీడుగా డ్రైవ్ చేయసాగింది. ఆ మార్గం ఆమెకి కొత్త; బొబ్బిలి తరువాత పదిహేను కిలోమీటర్ల దూరం సాగిన తరువాత ఏరు వస్తుందనీ, ఆ ఒడ్డున కారు ఆపి పడవలో ఏరు దాటాలనీ భరద్వాజ క్లియర్‌గా ఆమెకి చెప్పడంతో ఆమె మస్తిష్కంలో ఆ మార్గం నిక్షిప్తమైపోయింది. బొబ్బిలి దాటిన తరువాత అడ్డరోడ్డు దాటగానే ఆమె కారుకి ఓ ఎడ్లబండి అడ్డురావడంతో సడెన్‌బ్రేక్ వేసింది అర్చన. అప్పుడు కారు దగ్గరకి వచ్చాడా వ్యక్తి. చూడటానికి అతనికి అరవైఏళ్లుంటాయి. పంచె, లాల్చీలో ఉన్న ఆ వ్యక్తి ఆమెకో నమస్కారం పెట్టి ''అమ్మా! తమరు ఏటి ఒడ్డు కాసేనా ఎళ్తున్నారు? అని అడిగాడు.

ఆమె ''అవును'' అని కోపంగా అతని వైపు చూసింది.''అమ్మా! మా ముసల్దానికొంట్లో బాగులేదు. నాను తొరగా సీతాపురం ఎళ్లాలి. దాని మందుల కోసమే నాను పట్నం ఒచ్చినాను. ఈ రోజు ఏటయిందో ఏటో ఒక్క బస్సు కూడా రానేదు; నీకు పున్నెం ఉంటాది....నన్ను ఆ ఏటి దగ్గరదించేయమ్మా'' అన్నాడు ఆ ముసలి వ్యక్తి. అతని ముఖంలో ఆందోళన కనిపిస్తోంది. కానీ అర్చనకి అతని రూపు, ఆ మాసిన బట్టలు, అతని వాచకం, వాలకం చూసి అసహ్యం వేసింది. అతనికి లిఫ్ట్ యిస్తే కారు మొతాన్ని శుభ్రం చెయ్యాలనుకుంటూ అతని కసిరి కారుని ముందుకు పోనిచ్చింది.

***

తనను ఉదయం ఆ అడ్డరోడ్డు దగ్గర లిఫ్ట్ అడిగిన వ్యక్తే ఈ పడవ నడిపేవాడు....యిప్పుడెలా? ఉదయం తాను లిఫ్ట్ యివ్వనందుకు కోపంతో పడవ వెయ్యను అంటే తనేం చేయాలి?! పాపం తాను లిఫ్ట్ యివ్వనందు వల్ల అక్కడి నుంచి పదిహేను కిలోమీటర్లు నడిచి యిప్పుడొస్తున్నాడు. అందువల్ల అతనికి కోపం రావడం సహజం. ఆమెకి అతనితో మాట్లాడటానికి ధైర్యం చాలక రాజయ్యని పిలిచి వాడితో మాట్లాడమని చెప్పింది. అప్పుడు రాజయ్య అతని దగ్గరకు వెళ్లాడు.

''అప్పన్న మావా!'' దూరంగా నిల్చున్న అర్చనని చూపిస్తూ ''ఆమె మా దొరగారి చుట్టాలు. ఆళ్లింటికి పెళ్లికొచ్చారు. ఆమె బాబుకి యిపరీతమ్మైన జొరం, వాంతులూ అవుతున్నాయి. తొరగా పట్నం ఎళ్లి డాట్టరు బాబుకి సూపించాలి. అందుకే బేగి ఆళ్లని రేవు దాటించమనీ మా దొర నీకు సెప్పమన్నాడు; ఆవలొడ్డున ఆళ్ల కారుంది. దాంట్లో ఆళ్లు పట్నం ఎళ్తారు'' అన్నాడు రాజయ్య. ఆ మాటలు విన్న తర్వాత అప్పన్న కోపంగా రాజయ్య వైపు చూసి ''నీకుతెల్దేట్రా రాజిగా! మీ అత్తకు రెండు రోజుల్నించి యిపరీతమ్మైన జొరం; దాని మందుల కోసమే నాను ఉదయాన్నే పట్నం ఎల్లి బస్సులు లేక నానా ఇబ్బందులు పడి నడుచుకుంటూ యిప్పుడొచ్చినాను. దానికి తొరగా మందులియ్యకపోతే చాలా పెమాదం.... ఇప్పుడు పడవ ఎయ్యడం కుదర్దు'' అంటూ పడవని లంగరు వెయ్యడానికి వెళ్లసాగాడు.

ఈ సంభాషణ వింటున్న అర్చనకి కంట్లో నీరు ఉబుకుతోంది. తాను ఎంత త్వరగా వెళ్లాలనుకుంటుందో అంత ఆలస్యం అవుతోంది. అతనుగానీ పడవ వెయ్యకపోతే ఏరుదాటడం జరగని పని. అయిపోయింది. ఉన్న ఒక్కగానొక్క ఆధారం చేజారిపోతోంది. యిది తన స్వయంకృతాపరాధం. అతనికి కారులో లిఫ్ట్ యివ్వనందుకు కాబోలు పడవ వెయ్యటం లేదు. క్షణక్షణానికి బాబు జ్వరం పెరిగిపోతోంది. కళ్లు కూడా తెరవటం లేదు. యిప్పుడేం చేయాలో ఆమెకి అర్థం అవట్లేదు.

పడవని లంగరు వేసి పడవ అప్పన్న ఊరి వేపు వెళ్లిపోతున్నాడు. ఆమె నిస్పృహతో ఏం చెయ్యాలేక దూరంగా వెళ్లి కూర్చొని ఏడవసాగింది.

అలా ఎంత సేపు గడిచిందో ఆమె గమనించలేదు. యింతలో ''అమ్మా'' అన్న పిలుపు విని కళ్లు తెరిచింది. ఎదురుగా పడవ నడిపే అప్పన్న! ఆమె సంభ్రమాశ్చర్యాలకు ఒక్కసారిగా లోనైంది. అది కలో నిజమో ఆమెకి అర్థం కావట్లేదు.

''అమ్మా! తొరగా రండమ్మా! బయలుదేరదాం'' అన్నాడు. ఆమె ఆశ్చర్యంలోంచి యింకా తేరుకోలేదు. ఆమె పరిస్థితిని గమనించిన అప్పన్న ''ఉదయం తొందర్లో నాకేటి తెల్వక మీ కారులో వత్తానన్నాను; అదీగాక మా ముసల్దానికి యిపరీతమ్మైన జొరం వల్ల దానికి మందులు బేగి యివ్వాలనీ తమర్ని అలా అడిగినాను; దానికి సెమించండమ్మా! ఈ రోజు అదేం రోగమో ఒక్క బస్సు కూడా రానేదు? అందుకే అలా అడిగినాను;'' అంటూ నమస్కారం పెట్టాడు.

అతని అమాయకత్వానికి ఆమెకు జాలి వేస్తోంది. ఆమెకి ఏం చెప్పాలో తెలియని స్థితి. కాసేపటికి తేరుకొని పిల్లాణ్ణి భుజాన వేసుకొని పడవ దగ్గరకు బయలుదేరింది. మరి కాసేపటికి పడవ బయలు దేరింది.

పడవ నెమ్మదిగా ఏటిలో సాగిపోతోంది. సంధ్యా సమయం కావడంతో గాలి ఉధృతంగా వీస్తుండటంతో తెరచాప ఊగుతోంది. అప్పన్న గడకర్ర సాయంతో ఎంతో తీక్షణంగా పడవని పోనిస్తున్నాడు. సూర్యుడు పశ్చిమాద్రికి కృంగి పోతున్నాడు. యిప్పుడామెకు ప్రశాంతంగా ఉంది. గోధూళి వేళ కావడంతో పడమటి దిక్కు రాగరంజితం అవుతోంది.

''అప్పన్నా! నీ భార్యకు ఒంట్లో బాగులేదన్నావ్ కదా?! ఆమెకూ మందులు అవసరం కదా? యింటికెళ్తున్న వాడివి తిరిగి మళ్లీ ఎందుకొచ్చావ్?'' అంది అర్చన. ఆమెకు చాలా సేపట్నుంచి ఈ ప్రశ్న మెదడును తొలిచేస్తోంది. కాసేపటికి అప్పన్న చెప్పటం మొదలు పెట్టాడు.

''అది కాదమ్మగోరూ! నేను, నా ముసల్ది కాటికి కాళ్లుసాచి కూర్చున్నాం. యిపుడు ఈ మందులు ఆలీసం అయితే ఏటైపోతుందమ్మా? ఏటీ అవదు; అందుకే యింటికి యెల్లడానికి బయలుదేరి సగం దూరం ఎల్లాక తమరి బాబు గుర్తొచ్చాడు; సిన్నోడికి జొరం, యెంటనే పట్నం తీసికెళ్లకపోతే పెమాదం; నేను పడవ యెయ్యక ఎంత తప్పు చేసినానో అప్పుడర్థమైందమ్మా! అందుకే పరుగుపరుగున వొచ్చేసినాను; నా తప్పును సెమించడమ్మా!''

అప్పన్న మాటలు వింటుంటే అర్చనకు దుఃఖం ముంచుకొస్తోంది; అతని మానవత్వం ఆమెను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. తనకు లేనిదీ, అతనిలో మూర్తీభవించిందీ ఆ మానవత్వమే..... యిప్పుడామెలో ఎన్నాళ్ల నుంచో పేరుకుపోయిన కఠినత్వం, గర్వం కరిగిపోసాగాయి. ఆమె ఆలోచనలల్లో, భావాల్లో మార్పు ద్యోతకమౌతోంది. సాయంసంధ్య యిప్పుడెంతో అందంగా కనిపిస్తోంది. మార్పు ఆమెలో అంకురించింది.

యిప్పుడు ఆమెకు ప్రకృతి ఎంతో శోభాయమానంగా కనిపిస్తోంది. ఆమె ఆలోచిస్తోంది. నిజమైన ప్రేమలు, ఆప్యాయతలు, స్వచ్ఛత యిక్కడే ఉన్నాయి. ఈ అనుబంధాలలో ఉన్న తీయదనం యిప్పుడే తెలిసింది. ఒడిలో బాబు ప్రశాంతంగా నిద్రపోతున్నాడు. రానురాను నావ పచ్చని ఊరికి దూరంగా, ఆవలి తీరానికి దగ్గరగా సాగిపోతోంది.